ప్రతిభతో మురిసె..



రామచంద్రపురం వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు విజేతగా నిలిచాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఎంపీ గంటి హరీష్ మాధుర్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.
- న్యూస్‌టుడే, రామచంద్రపురం

ఆనందం వెల్లివిరిసె

రాజమహేంద్రవరం శివారు గైట్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ తరగతులు ఉత్సాహంగా ముగిశాయి. దేశంలోని మొత్తం 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి ప్రత్యేకంగా ఎంపిక చేసిన 300 మంది సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్లు 12 రోజులు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ప్రతిభ చూపారని ఎన్‌సీసీ 18 ఆంధ్ర బెటాలియన్ కాకినాడ గ్రూపు కమాండర్ ఆర్.ఎం. అగర్వాల్ చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్లు తమ సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ముగింపువేడుకలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.
- న్యూస్‌టుడే, రాజానగరం



క్యాడెట్ల సాంస్కృతిక ప్రదర్శన

లెక్క తేలింది.. కిక్కు ఎవరికో!

- లాటరీ విధానంలో లైసెన్సుల మంజూరు నేడు
- ఉమ్మడి జిల్లాలో దరఖాస్తు రుసుము ద్వారా ప్రభుత్వానికి రూ.236.06 కోట్ల ఆదాయం



కలెక్టరేట్ ఆవరణలో దుకాణాల లాటరీ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎక్సైజ్ ఈఎస్, రెవెన్యూ అధికారులు

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్: ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రభుత్వం నోటిఫై చేసిన మద్యం దుకాణాలకు లాటరీ పద్ధతిలో సోమవారం కేటాయిస్తారు. ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డీసీ వై.చైతన్యమురళి పర్యవేక్షణలో యంత్రాంగం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తిచేసింది. లాటరీకి కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయాలతో పాటు.. తూర్పుగోదావరి జిల్లాలో ఆనం కళాకేంద్రంలో ఏర్పాట్లు చేశారు. మూడు జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షణలో జేసీలు, డీఆర్వోలు, ఆర్డీవోలతో పాటు.. ఆబ్కారీ యంత్రాంగం ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోగా మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ కొలిక్కిరావచ్చని భావిస్తున్నారు. లాటరీ ప్రక్రియ పూర్తయ్యాక.. ఈనెల 15న ప్రైవేటు మద్యం దుకాణాలు అప్పగిస్తారు. 16 నుంచి కొత్త మద్యం విధానం అమల్లో భాగంగా వ్యాపారాలు కొనసాగనున్నాయి.

మద్యం దుకాణాలు-దరఖాస్తులు ఎన్నంటే..?

జిల్లా	నోటిఫై చేసిన దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు	దరఖాస్తు ఆదాయం (రూ.కోట్లలో..)
కాకినాడ	155	3,332	66.64
అంబేడ్కర్ కోనసీమ	133	4,087	81.74
తూర్పుగోదావరి	125	4,384	87.68

లక్ష్యం అలా.. స్పందన ఇలా..

దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానించిన ప్రభుత్వం ఒక దుకాణానికి కనీసం 30 దరఖాస్తులు వస్తాయని భావించింది. 1:30గా లక్ష్యాన్ని నిర్దేశించింది. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిశాక పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో ఒక్కో దుకాణానికి సగటున 28.57 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల రూపంలో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వానికి నాన్ రిఫండబుల్ రూపంలో రూ.236.06 కోట్ల ఆదాయం సమకూరింది. ■ తూర్పుగోదావరి జిల్లాలో సగటున ఒక్కో దుకాణానికి అత్యధికంగా 35.07 దరఖాస్తులు వస్తే.. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సగటున ఒక్కో దుకాణానికి 30.72 దరఖాస్తులు, కాకినాడ జిల్లాలో 21.43 దరఖాస్తులు రావడం గమనార్హం.

గుర్తింపు కార్డులు ఉన్నవారికే..

మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఇచ్చిన వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేశాం. అవి ఉన్న వారినే లాటరీ నిర్వహించే భవనంలోకి అనుమతిస్తాం. సక్రమ వాతావరణంలో లాటరీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ఎవిధమైన గొడవలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో దుకాణాల కేటాయింపు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.
- ఎన్.కె.వి.ప్రసాద్, ఆబ్కారీ సూపరింటెండెంట్





కనులనిండుగా దసరా..

దసరా పండగ వేళ జిల్లాలో పలుచోట్ల ఉత్సవాలు అంబరాన్ని తాకాయి. అమలాపురంలో చెడీ తాలింఖానా ప్రదర్శనకు హాజరైన మంత్రి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్ కత్తులు చేతపట్టి సందడి చేశారు. అమలాపురం ఓంశాంతి కేంద్రంలో నవ దుర్గలుగా బాలికలు ఆకట్టుకున్నారు.

గుంత.. ప్రాణం తీసింది..

రహదారిపై గుంత. ప్రయాణానికి ఇబ్బంది మాత్రమేకాదు.. ప్రాణాపాయమని చెప్పిన ఘటన కాకినాడ జిల్లా సామర్లకోట మండల శివారు మాధవపట్నం-కాకినాడ ప్రధాన రహదారిలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారం మేరకు.. తాళ్లరేవు మండలం జార్జిపేటకు చెందిన దొంతంశె ఆదిలక్ష్మి(65), భర్త భద్రరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై జార్జిపేట నుంచి పెద్దాపురంలో శుభకార్యానికి బయలుదేరారు. మాధవపట్నం సమీపంలో వారి ద్విచక్ర వాహనం రహదారిపైనున్న గుంతలోంచి వెళ్లడంతో కుదుపునకు వాహనంపై కూర్చున్న ఆదిలక్ష్మి వెనక్కి పడిపోయారు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతో మంది క్షతగాత్రులవుతున్నా.. గడిచిన అయిదేళ్లలో కనీసం రహదారిపై గుంతలు పూడ్చలేదని స్థానికులు పేర్కొన్నారు.
- న్యూస్‌టుడే, సామర్లకోట గ్రామీణం



మృతి చెందిన వృద్ధురాలు ఆదిలక్ష్మి..



వృద్ధురాలు మృతికి కారణమైన గుంత ఇదే..


పల్లె పండగకు వేళాయె..

జిల్లా రూ.51.69 కోట్లతో 778 అభివృద్ధి పనులు

దసరా పండగ ముగిసింది. ఇక పల్లె పండగ మొదలవుతోంది. జిల్లాలో సోమవారం నుంచి ఈ నెల 20 వరకు వారంపాటు పల్లె పండగ వారోత్సవాల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. వారోత్సవాల్లో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా శ్రీకారం చుట్టనున్నారు.

చేపట్టనున్న పనులు ఇలా..

నియోజకవర్గం	పనులు	నిధులు (రూ.లక్షల్లో)
అమలాపురం	75	711.00
ముమ్మిడివరం	120	977.89
రామచంద్రపురం	122	463.95
మండపేట	139	509.75
కొత్తపేట	83	1063.70
రాజోలు	49	318.74
పి.గన్నవరం	190	1124.00



న్యూస్‌టుడే, ముమ్మిడివరం

గత వైకాపా పాలనలో రోడ్లపై తట్ట మట్టి కూడా వేయక ప్రజలు అధ్వాన రహదారుల్లో ప్రయాణించారు. కాలనీల్లో మురుగు కాలువల వ్యవస్థ లేక.. నీరు బయటకు పారక దుర్గంధం భరిస్తూనే వచ్చారు. మౌలిక వసతులు కల్పనకు నోచుకోని పల్లెల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి.. నిధులు కేటాయించింది. ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రతి గ్రామంలోనూ మౌలిక వసతుల కల్పనకు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 'పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలు' పేరుతో అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు శంకుస్థాపనలు చేయనున్నారు.



సీసీ రహదారిగా మారనున్న అనాతవరం మార్గం

జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 22 మండలాల పరిధి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.51.69 కోట్లతో 778 పనులకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు భూమి పూజ చేస్తారు. గ్రామ పంచాయతీల్లో సిమెంటు రహదారుల నిర్మాణం, సీసీ డ్రెయిన్లు, తారు రోడ్లు, నల్ల కంకర రోడ్లు, పశువుల షెడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులు డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేయాలనే కార్యాచరణతో అధికారులు సన్నద్ధమయ్యారు.

గ్రామాల అభివృద్ధికి బాటలు

జిల్లాలో గ్రామ సభల్లో తీర్మానాల ప్రకారం రూ.51.69 కోట్లుతో అభివృద్ధి పనులకు పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమం ద్వారా ప్రజా ప్రతినిధులు శంకుస్థాపనలు చేయడానికి ఏర్పాట్లు చేశాం. ఇది ఓ పండుగ వాతావరణంలా నిర్వహిస్తాం.
-మధుసూదన్, డ్వామా, పీడీ

15న శాలివాహన సంఘ సమావేశం

అంబాజీపేట: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా శాలివాహన సంఘ సమావేశాన్ని ఈ నెల 15న నిర్వహించనున్నట్లు సంఘ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబాజీపేట మండలం మాచవరంలోని సంఘ భవనం వద్ద ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని, సంఘీయులు హాజరుకావాలని కోరారు.

నవ్వుల హయాతీ



రాజోలు మండలం తాటిపాకలో ఆదివారం సినీనటి డింపుల్ హయాతీ సందడి చేశారు. ఓ వస్త్ర దుకాణం ప్రారంభోత్సవానికి హాజరైన ఆమెను చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబర్చారు. ఈ సందర్భంగా ఆమె వేదికపై నృత్యం చేసి అందరినీ అలరించారు.
-న్యూస్‌టుడే, రాజోలు

హరివిల్లు సోయగం



దసరానాడు నింగిని మెరిసిన ఇంద్రధనుస్సు సోయగం చూపరులను ఆహ్లాదం కలిగించింది. ఉదయం వాన, అనంతరం ఎండ రావడంతో చెముడులంక, జొన్నాడ, పెనికేరు తదితర గ్రామాల్లో కనిపించిన హరివిల్లు మురిపించింది.
- న్యూస్‌టుడే, ఆలమూరు

ఫలశోభితం.. మనోహరం



అభయ ప్రదాత వేంకటేశ్వరుని కృపాకటాక్షాల కోసం ఏడు శనివారాల నోము ఆచరించే భక్తజనం వేలాదిగా కోనసీమ తిరుమల వాడపల్లికి తరలివచ్చారు. శ్రీవారు వివిధ రకాల ఫలాలు, పుష్పాల అలంకరణలో భక్తులకు దివ్యమనోహరంగా దర్శనమిచ్చారు. ఆదివారం కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణం, అష్టోత్తర శతనామావళి, బాలభోగం తదితర కార్యక్రమాలను అర్చకులు రమణీయంగా జరిపించారు. స్వామివారికి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు పట్టువస్త్రాలు సమర్పించారు. శమీపూజ కనుల పండువగా జరిగింది. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.
- న్యూస్‌టుడే, వాడపల్లి (ఆత్రేయపురం)

దమ్మ దీక్షోత్సవం



ఆదుర్రులోని ఆది బౌద్ధస్తూపం ప్రాంగణంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, బుద్ధవిహార్ ఆధ్వర్యంలో సోమవారం దమ్మ దీక్షోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆరాధకులు స్తూపం చుట్టూ ప్రదక్షిణలు చేసి సామూహికంగా బుద్ధ వందనం చేశారు. బుద్ధుని దివ్య సందేశాలను పలువురు వక్తలు వివరించారు. అనంతరం బుద్ధవిహార్‌లో గౌతమ బుద్ధుని పాలరాతి విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. బీఎస్ఐ నాయకుడు ఎస్.ఎస్.ఆర్.భూపతి, సర్పంచి బళ్ల శ్రీనివాసరావు, మెండి ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, మామిడికుదురు

పోరాట యోధుడు సాయిబాబా

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: మానవ హక్కుల ఉద్యమకారుడు, దిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా మృతితో ఆయన స్వస్థలం అమలాపురంలో విషాదం అలముకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం నల్లమిల్లిలో పుట్టిన ఆయన భవితకు పునాది ఇక్కడే పడింది. ఇక్కడ చదువుతున్న రోజుల నుంచే పేదలకు సాయం చేయాలని తపించేవారు. అనంతరం హక్కుల కోసం పోరాటం చేశారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

● ఆదివాసీలు, పీడిత ప్రజల కోసం మేధావులతో కలసి ఉద్యమాలు చేసిన ప్రొఫెసర్ సాయిబాబా పోరాట యోధుడని పౌరహక్కుల, ప్రజాసంఘ నాయకులు కొనియాడారు. సాయిబాబా మృతి పట్ల అమలాపురంలోని గడియారస్తంభం ప్రాంగణంలో ఆదివారం సంతాప సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బంధువు గంగుమళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ సాయిబాబా పేదల పక్షాన పోరాడారన్నారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో జైలులో పెట్టినా నిర్దోషిగా విడుదలయ్యారన్నారు. ఇంతలోనే తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూయడం బాధాకరమన్నారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కె.సత్తిబాబు మాట్లాడుతూ అంగవైకల్యం ఉన్నా ఉద్యమాల బాట పట్టారన్నారు. ఆయనను అన్యాయంగా జైలులో పెట్టి మరణించేలా చేశారన్నారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తామంటూ గడియారం స్తంభం ప్రాంగణంలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లెల మనోహర్, బాబురావు, ఇక్బాల్ రాజేష్, త్రిమూర్తులు, జి.వెంకటేశ్వరరావు తతితరులు పాల్గొన్నారు.



అమలాపురంలోని గడియారస్తంభం ప్రాంగణంలో నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నల్లబల్ల కాదు.. నయా బోధన

బీసీ వసతి గృహాల్లో డిజిటల్ తరగతులు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్


ప్రభుత్వ వసతి గృహాల్లో అధునాతన బోధనకు బాటలు పడుతున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్ పాఠాలు చెప్పనున్నారు. తొలిసారిగా వెనుకబడిన తరగతుల(బీసీ) సంక్షేమ వసతి గృహాల్లో ఈ బోధనను ప్రవేశపెట్టనున్నారు. వైకాపా పాలనలో ఇక్కడి విద్యార్థులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారు. కూటమి అధికారంలోకి వచ్చాక.. వసతుల కల్పనతో పాటు విద్యాబోధనపై దృష్టి పెట్టింది.

జిల్లా వివరాలు..

వసతి గృహాలు	సంఖ్య	విద్యార్థులు
ప్రీ మెట్రిక్	9	335
పోస్టు మెట్రిక్	13	696

బోధన ఇలా..

జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాలు 21 ఉన్నాయి. వీటిలో 1,050 మంది వసతి పొందుతున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉన్న వారిని ప్రీ మెట్రిక్‌గా పిలుస్తారు. డిజిటల్ బోధనకు ఎంపికైన వసతి గృహాలోల ఓ తరగతి గదిని ఆహ్లాదకరంగా తీర్చి దిద్దుతారు. అందులో డిజిటల్ ఇంటరాక్టివ్ ప్యానల్ ఏర్పాటు చేస్తారు. పాఠశాల నుంచి విద్యార్థులు వసతి గృహానికి వచ్చాక డిజిటల్ విధానంలో బోధించనున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నారు. పదో తరగతి విద్యార్థులకు అనుమానాలు నివృత్తి చేసేందుకు ప్రత్యేకంగా ట్యూటర్లను నియమించారు. వీరు గణితం, సైన్సు, ఆంగ్లం, హిందీ, సబ్జెక్టులను బోధిస్తారు. ఒక్కొక్కరికి నెలకు రూ.15వేల చొప్పున చెల్లిస్తారు.



అంతర్వేది ఎంపిక..

జిల్లాలో అయిదు వసతి గృహాల్లో వీటిని ఏర్పాటు చేయాలని భావించారు. సొంత భవనాలు ఉన్న వాటిలో మాత్రమే ఏర్పాటు చేయాలనే నిబంధన కారణంగా అంతర్వేది పల్లిపాలెంలోని ప్రీమెట్రిక్ బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఎంపిక చేశారు. అమలాపురంలోనూ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నవంబరు 14న ప్రారంభించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

సొంత భవనాల్లో..

తొలుత సొంత భవనాలు ఉన్న వసతి గృహాల్లో ఏర్పాటు చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేశాం. విడతల వారీగా అన్ని వసతి గృహాల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఉన్నతాధికారులు చెప్పారు. ఈ విధానంలో విద్యార్థులకు సులభంగా అర్థమవుతుంది.
-ప్రసాద్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అమలాపురం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కా వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. సోమవారం గోదావరి భవన్‌లో మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. డివిజన్, మండల స్థాయిల్లో అధికారులు ప్రజల నుంచి యథావిధిగా అర్జీలు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు.

తీర గ్రామాల్లో జాతరలు

కాట్రేనికోన: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని తీరగ్రామాల్లో ఆదివారం జాతరలు మొదలయ్యాయి. పల్లం, చిర్రయానం తదితర గ్రామాల్లో ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడురోజులపాటు ఈ జాతర్లను నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా స్వగ్రామాలకు చేరుకున్నారు. 50 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్సై అవినాష్ తెలిపారు.



వేదమంత్రాలు.. యుద్ధతంత్రాలు

ఈ పురోహితుడికి వేదమంత్రాలే కాదు.. యుద్ధతంత్రమూ తెలుసు. అమలాపురానికి చెందిన విమలాదిత్య రెండు చేతులతో భారీ కత్తులు పట్టుకుని విన్యాసాలు చేయడంలో దిట్ట. దసరా సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయుధ పూజ చేశారు. పూజల అనంతరం పోలీసుల కోరిక మేరకు కత్తులతో విన్యాసాలు చేశారు.
-న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

బలహీనంగా గట్లు.. బిక్కుబిక్కున జనం

జిల్లాలో ఏటిగట్లు పలుచోట్ల బలహీనంగా ఉన్నాయి. వరద వచ్చిందంటే ఆ వెంబడి ఉన్న లంక గ్రామాల ప్రజలు బిక్కు బిక్కుమంటూ గడుపుతుంటారు. గత అయిదేళ్ల వైకాపా పాలనలో నిధులు కేటాయించకపోవడంతో మరింత నిర్లక్ష్యానికి గురయ్యాయి. తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు.
- న్యూస్‌టుడే, మలికిపురం, సఖినేటిపల్లి

2022 ఆగస్టులో వచ్చిన వరదల సమయంలో రాజోలు మేకలపాలెంలో వరద పరిస్థితిని పరిశీలించడానికి వచ్చిన అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏటిగట్లను విస్తరించనున్నామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.350 కోట్లతో ప్రతిపాదనలు పంపినా రూపాయి కూడా మంజూరు చేయలేదు. కనీసం ఏటిగట్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో రక్షణ పనులకు నిధులు ఇవ్వలేదు. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో పల్లంకుర్రు, కాట్రేనికోన, ఐ.పోలవరం దీవిలో సుమారు 12 గ్రామాల పరిధిలో సుమారు 40 కిలోమీటర్ల మేర గట్టు బలహీనంగా ఉంది. ఆత్రేయపురం, కె.గంగవరంలలో గట్టు జారిపోతోంది. కపిలేశ్వరం మండలం అద్దంకివారిలంక, కేదార్లంక పరిధిలో లంక భూములు గోదావరిలో కలిసిపోయినట్లు అధికారుల అంచనా.

ఎక్కడెక్కడ అంటే..

● మలికిపురం మండలం దిండిలో కాకరపుల్లమ్మ ర్యాంపు వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉంది. 2006లో వచ్చిన వరదకు గట్టుపై నుంచి వరద నీరు పొంగి పొర్లడంతో మేడిచర్లపాలెం, దిండి గ్రామాల ప్రజలు యుద్ధప్రాతిపదికన ఇసుక, కంకర తెచ్చి గట్టును కాపాడుకున్నారు. 2022 జులైలో వచ్చిన వరదల్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

● రామరాజులంక ఏటిగట్టుపై పెదతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్ తలుపులు సక్రమంగా లేకపోవడంతో వరదనీరు స్లూయిస్ నుంచి వెనక్కి డ్రెయినులోకి వచ్చి పంటచేలు మునకకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతూ ఉంటారు. అక్కడ తాత్కాలికంగా ఇసుక బస్తాలతో తలుపులు పైకి లేవకుండా అడ్డువేయడం తప్ప శాశ్వత పనులు చేయడం లేదు.



సఖినేటిపల్లి బోను వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టు

● గతంలో సఖినేటిపల్లిలో ఏటిగట్టుపై రెండడుగుల ఎత్తున వరద నీరు ప్రవహించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

● అంతర్వేది, రామేశ్వరం, గొంది, సఖినేటిపల్లి బోను, టేకిశెట్టిపాలెం, రామరాజులంక, దిండి శ్మశానవాటిక వంతెన వద్ద, దిండి రిసార్ట్స్ వద్ద, శివకోటి, రాజోలు నున్నవారి బాడవ, మేకలపాలెం, పాశర్లపూడి, బాడిలంక, పెదపట్నం, ఆదుర్రు, గోగన్నమఠం తదితర గ్రామాల్లో సుమారు 28 కిలోమీటర్ల మేర ఏటిగట్లు బలహీనంగా ఉన్నాయి.

● ఆత్రేయపురం మండలంలో వశిష్ఠ ఎడమ గట్టు, ఐ.పోలవరం దీవిలో 12 గ్రామాల పరిధిలో ఉన్న ఏటిగట్టు ప్రమాదకరంగా ఉంది. పశువుల్లంక, కొమరగిరి, మురమళ్ల తదితర చోట్ల కూడా ఏటిగట్లు బలహీనంగా ప్రమాదకరంగా ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

ఏటిగట్ల పటిష్టతకు చర్యలు తీసుకుంటాం. ఆయా ప్రాంతాలను జలవనరుల శాఖ అధికారులతో కలిసి పరిశీలించాం. వీటి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.
- దేవ వరప్రసాద్, రాజోలు ఎమ్మెల్యే

శరణు దుర్గా.. శరణు..

దసరా ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. దేవీ శరన్నవరాత్రుల్లో అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించిన భక్తులు వేడుకలు ముగిసిన సందర్భంగా దీక్షలు విరమించారు. శమీ వృక్షానికి పూజలు చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ఆలయాలు, బహిరంగ వేదికలపై తొమ్మిది రోజుల పాటు కొలువుదీరిన అమ్మవార్లకు భక్తులు శక్తికొలదీ నైవేద్యాలు సమర్పించి దీవెనలందించాలని వేడుకున్నారు. ఉత్సవాలు ముగిసిన సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదానాలు ఏర్పాటు చేశారు.

– న్యూస్‌టుడే, బృందం


అమలాపురం పట్టణంలో శైలపుత్రిగా..


ముమ్మిడివరం: రాణేలంకలో విజయదుర్గగా..


అంబాజీపేటలో దుర్గాదేవిగా వాసవిమాత


మామిడికుదురు: పాశర్లపూడిలో..


ఆలమూరు: వేంకటేశ్వర ఆలయంలో..


ఉప్పలగుప్తం గ్రామోత్సవంలో శక్తిరూపిణులు

వేడుకగా రావణ సంహారం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరంలో రావణ సంహార కార్యక్రమం వేడుకగా శనివారం జరిగింది. కొండ దిగువన జూనియర్ కళాశాల ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మందుగుండు సామగ్రితో తీర్చిదిద్దిన రావణ బొమ్మను దగ్ధం చేశారు. విద్యుత్తు దీపాలంకరణ, బాణాసంచా మెరుపులు భక్తులను ఆకట్టుకున్నాయి. అధికారులు భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు.


అన్నవరంలో బాణసంచాతో తీర్చిదిద్దిన రావణాసురుడి బొమ్మ


వాడపల్లిలో అన్నప్రసాద పంపిణీ విభాగాన్ని పరిశీలిస్తున్న డీసీ తదితరులు

భక్తుల ఇక్కట్లపై ఆర్టీజీఎస్ ప్రత్యేక దృష్టి

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరుని ఆలయం వద్ద ప్రతి శనివారంతో పాటు పర్వదినాల్లో రద్దీ అధికంగా ఉంటోంది. ఈ తరుణంలో భక్తులు ఇబ్బందులు, తదితర విషయాలను ఇకపై రాష్ట్రస్థాయిలో పరిశీలించనున్నారు. రాష్ట్ర సచివాలయంలో ఉన్న రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టం (ఆర్టీజీఎస్) ద్వారా అధికారులు పరిశీలిస్తారు. ఇక్కడ ఉన్న సీసీ కెమెరాలను ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేస్తారు. ఉత్సవాలు, రద్దీ వేళల్లో సచివాలయం నుంచి పర్యవేక్షణ ఉంటుంది. శనివారం ఆలయంలోని ప్రసాదం తయారీ పోటు, అన్నప్రసాద తయారీ, క్యూలైన్లు, సీసీ కెమెరాల పనితీరు, మరుగుదొడ్ల నిర్వహణ తదితర విభాగాలను దేవస్థానం డీసీ చక్రధరరావు తనిఖీ చేశారు. ప్రసాద నాణ్యతను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పర్యవేక్షకులు రాపాక శ్రీనివాస్, పులపర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం


రాజేశ్వరి

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం గౌతమీ గోదావరి వారధిపై నుంచి దూకి పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం నడిపూడికి చెందిన వెన్నేటి రాజేశ్వరి (35) ఆత్మహత్యాయత్నం చేశారు. గోదావరిలోకి యువతి దూకడం గమనించిన స్థానిక జాలర్లు నావపై వెళ్లి ఆమెను కాపాడారు. విషయం తెలుసుకున్న టౌన్ హెచ్‌సీ నాయుడు ఘటనాస్థలానికి చేరుకుని యువతిని రావులపాలెం ఆసుపత్రికి తరలించారు. భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిసింది. ఆమె భర్త శ్రీనివాసరావును రప్పించి, పోలీసులు కౌన్సెలింగ్ చేసి భార్య రాజేశ్వరిని అప్పగించారు.

కాల్‌మనీ కేటుగాళ్లు



అధిక వడ్డీల వడ్డింపు.. చెల్లించకుంటే వేధింపులు

మండపేట పరిసర ప్రాంతాల్లో వేలల్లో అప్పులిచ్చి.. అవి తీరిపోయినా ఇంకా చెల్లించాలంటూ వేధింపులకు గురిచేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. ఏళ్లుగా గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారం.. గత సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా మండపేట విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. చిన్నచిన్న వ్యాపారాలు చేసి జీవనం సాగించే వారు అవసరార్థం చేబదులుగా వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకున్నారు. అడిగిన వెంటనే అప్పు దొరుకుతుండటంతో దస్తావేజులు తనఖా పెట్టి.. ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేసి నగదు తీసుకుంటున్నారు. నెలనెలా సక్రమంగా వడ్డీ చెల్లించి, కొంత అప్పు తీరిన తరువాత వ్యాపారులు కోర్టు నోటీసులు ఇస్తున్నారు. తాము పొందిన రుణానికి అయిదారు రెట్లు నగదు చెల్లించాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొనడంతో ఎవరికి చెప్పాలో పాలుపోక మానసిక వేదనకు గురవుతున్నారు. ఇటీవల ఒక కుటుంబం తల్లిదండ్రులతోపాటు ఇద్దరు కుమారులు వారణాసిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనకు ఈ కాల్‌మనీ వ్యవహారమే కారణమని స్థానికంగా చర్చ జరుగుతోంది.

రూ.వేలల్లో అప్పులిస్తారు.. వడ్డీ మీద వడ్డీలు వేసి రూ.లక్షలు, రూ.కోట్లు చెల్లించాలని వేధిస్తారు. కుదరదంటే కోర్టు నోటీసులు పంపిస్తారు. ఇదీ జిల్లాలోని పెరిగిపోతున్న కాల్‌మనీ దందా. వేధింపులు భరించలేక పోతున్నాం బాబోయ్ అంటూ బాధితులు జిల్లా యంత్రాంగాన్ని ఆశ్రయిస్తున్నారు.

– న్యూస్‌టుడే, మండపేట

రాజకీయ పలుకుబడితో బెదిరింపు

అప్పు పుట్టిందన్న సంతోషంలో ఎటువంటి ఆధారాలు తమ వద్ద ఉంచుకోకపోవడం బాధితులకు ఇబ్బందిగా మారింది. ఈవిధంగా మండపేట పరిసర ప్రాంతాల్లో 75 మంది వరకు బాధితులు ఉండొచ్చని అంచనా. నలుగురు వ్యాపారులు వీరిని వేధింపులకు గురిచేస్తున్నారు. అడిగినంత నగదు చెల్లించకపోతే రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఇళ్లకు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు వాపోతున్నారు.

రూ.20 వేలకు రూ.2.50 లక్షలు ఇమ్మంటున్నారు..



చిన్న వ్యాపారం చేస్తున్నా. రెండేళ్ల క్రితం దస్తావేజులపై రూ.20 వేలు తీసుకుని రోజుకు రూ.300 వడ్డీతో పూర్తిగా చెల్లించా. దస్తావేజులు అడిగితే ఇవ్వకుండా సంవత్సరం పోయాక రూ.2.50 లక్షలు ఇవ్వాలంటూ కోర్టులో కేసు వేశారు.

– ప్రసాద్, బాధితుడు, మండపేట

రూ.కోటి చెల్లించమంటున్నారు..



2014లో వ్యాపార అవసరాల కోసం రూ.5 లక్షలు అప్పు తీసుకున్నా. 2016లో పూర్తిగా చెల్లిద్దామని ప్రామిసరీ నోటు ఇమ్మని అడిగితే.. అప్పటికే తీసుకున్న అప్పుపై రూ.32 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం రూ.1.05 కోట్లు చెల్లించాలంటూ కేసు వేశారు. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– ఎం.రామ్‌రహీమ్, బాధితుడు

ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు..



గతంలో ఓ వ్యాపారి వద్ద రూ.60 వేలు అప్పు తీసుకుని రూ.30 వేలు చెల్లించా. ఇంకా రూ.6 లక్షలు ఇవ్వాలంటూ కోర్టు నోటీసులు ఇచ్చారు. బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగస్టులో పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసేందుకు నిరాకరించారు.

– దంగేటి దుర్గాప్రసాద్, బాధితుడు

నెలకు రూ.4 వేలు వడ్డీ..



సంవత్సరం క్రితం వేములపల్లి జగన్న లేఅవుట్‌కు సంబంధించిన దస్తావేజు ష్యూరిటీగా పెట్టి మా అమ్మ వరలక్ష్మి రూ.70 వేలు తీసుకున్నారు. ప్రతి నెలా రూ.4 వేలు వడ్డీ చెల్లించాం. పనుల్లేక కొంతకాలం వడ్డీ చెల్లించలేదు. తరువాత దస్తావేజుల కావాలంటే రూ.2.20 లక్షలు కట్టాలన్నారు.

– శ్రీను, బాధితుడు

పరిశీలించి చర్యలు

బాధితులు ఇచ్చిన ఫిర్యాదులన్నీ కోర్టుల పరిధిలో ఉన్నాయి. ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. పూర్తిగా విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సైకి ఆదేశాలు జారీ చేశాం. నివేదికనుబట్టి మా పరిధిలోని అంశాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– దొరరాజు, సీఐ, మండపేట రూరల్

బాస్కెట్‌బాల్ విజేత జిల్లా జట్టు


బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి జ్ఞాపకార్థం నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు విజేతగా నిలిచాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తన తండ్రి జీఎంసీ బాలయోగి పేరిట అమలాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ స్టేడియంను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. రామచంద్రపురంలో రెండో సింథటిక్ బాస్కెట్‌బాల్ కోర్టును అభివృద్ధి చేసేందుకు నిధులు ఇస్తామన్నారు. బాస్కెట్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, జిల్లా, రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఊరంతా ఉత్సవం.. సాహసం


కొంకాపల్లిలో అగ్గిబరాటా తిప్పుతున్న యువకులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: కర్ర సాము.. కత్తులతో సాహసాలు.. లేడి కొమ్ములతో పోరాటాలు... అగ్గి బరాటాల కోలాహలం.. యుద్ధ కళల ప్రదర్శనలతో దసరా రోజున శనివారం రాత్రి అమలాపురం పట్టణం పండగలా మారింది. పట్టణంలోని కొంకాపల్లి 189, మహిపాల వీధి 169, గండువీధి 114, రవణంమల్లయ్య వీధి 109, శ్రీరామపురం 80, రవణం వీధి 77, నల్లా వీధి 58వ సంవత్సర విజయదశమి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆయా వీధుల నుంచి మొదలైన ఊరేగింపులు ముమ్మిడివరం గేటు వద్దకు చేరుకున్నాక గడియారస్తంభం వరకు వచ్చి ప్రదర్శనలు ఇచ్చారు. చెడీ తాలింఖానా, వీరవిద్యలను ప్రదర్శించేందుకు, తిలకించేందుకు జిల్లా నలుమూలలతో పాటు దూర ప్రాంతాల నుంచి భారీగా జనం తరలి వచ్చారు. చెడీ తాలింఖానా ప్రదర్శనలతో పాటు గరగనృత్యాలు, శక్తివేషాలు, సినీనటుల డూప్‌లతో నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళ్లకు గంతలు కట్టుకుని మనిషి పొత్తికడుపు, కంఠంపై కొబ్బరి, ఆనప, అరటి, బీర కాయలు నరికిన దృశ్యాలు గగుర్పాటు కలిగించాయి. సుమారు 600 పోలీస్ బందోబస్తు నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్ మాథుర్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, తెదేపా నాయకులు మెట్ల రమణబాబు, జనసేన పార్టీ, భాజపా నాయకులు పాల్గొన్నారు.

జనసేన సమావేశ వేదికపై రాపాక


ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: మలికిపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన జనసేన పార్టీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కనిపించి అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేశారు. పార్టీ సభ్యత్వ నమోదు, వాలంటీర్లకు సన్మానం జరుగుతున్న సమయంలో వేదికపైకి వచ్చి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో కరచాలనం చేశారు. అనంతరం కొద్దిసేపు మాట్లాడారు. ఈ పరిణామానికి జనసైనికులు విస్మయానికి గురయ్యారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనిపై ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ.. మలికిపురం డిగ్రీ కళాశాల అధ్యాపకుల జీతాల సమస్యపై తనతో మాట్లాడడానికి రాపాక వచ్చారని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని రాపాక కూడా స్పష్టం చేశారు.

ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం


మాలల ఐక్యత సభలో మహాసేన రాజేష్, నాయకులు

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం న్యూస్‌టుడే: ఐక్యమత్యంతోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని మహాసేన రాజేష్ పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి మాలల ఐక్యత సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహాసేన రాజేష్ హాజరై మాట్లాడారు. ఎస్సీల రిజర్వేషన్ల పరిరక్షణ, మత స్వేచ్ఛ ఐక్యం కావాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను విడగొట్టి మాలలకు రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకు కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయన్నారు. మాలల రిజర్వేషన్లు పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలన్నారు. దళిత సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బచ్చల కామేశ్వరరావు మాట్లాడుతూ దళితులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు రిజర్వేషన్లు ఉపయోగపడతాయన్నారు. బీమ్ ఆర్మీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి శివకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ఏకం కావాలన్నారు. జిల్లా తెదేపా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొల్లాబత్తుల అప్పారావు మాట్లాడుతూ రిజర్వేషన్లతో ఎస్సీలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాల నాయకులు జంగా బాబూరావు, ఖండవల్లి లోవరాజు, కుంచే శ్రీహరి, నక్కా చిట్టిబాబు, యాదల సత్యనారాయణ, రేవు సుబ్బారావు, బచ్చల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	11,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

దేవి విగ్రహ నిమజ్జనంలో అపశ్రుతి

కోటిపల్లి గోదావరి వద్ద ఇద్దరి గల్లంతు



వేదమూర్తి వీరబ్రహ్మం (పాత చిత్రాలు)

ద్రాక్షారామ, పామర్రు, న్యూస్‌టుడే : పదిరోజులు పూజలు నిర్వహించి చివరిరోజు అమ్మవారిని గోదావరిలో నిమజ్జనం చేసే సమయంలో కోటిపల్లి గోదావరి వద్ద అపశ్రుతి చోటుచేసుకొంది. రామచంద్రపురం మండలం రావిచెరువు గ్రామానికి చెందిన భక్తులు ఆదివారం శరన్నవరాత్రి ముగింపులో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని కోటిపల్లి వద్ద గోదావరిలో నిమజ్జనం చేయడానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. నిమజ్జనం పూర్తయ్యాక గోదావరి దూరంగా లోతులో ఉన్న పంటు వద్దకు వెళ్లి స్నానాలకు దిగారు. అక్కడి లోతును అంచనా వేయలేక నరాల వేదమూర్తి (28), మేడిశెట్టి వీరబ్రహ్మం(38) అదుపుతప్పి నదిలో గల్లంతయ్యారు. వీరిని రక్షించడానికి ఒక వ్యక్తి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. రాత్రి వరకు గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదని ఎస్సై జానీబాషా తెలిపారు. సోమవారం ఉదయం తిరిగి గాలింపు చేపడతామన్నారు.

రావిచెరువు గ్రామంలో విషాదం

అప్పటి వరకు ఊరేగింపులో ఉత్సాహంగా గడిపి నదిలో గల్లంతయిన ఇద్దరూ రావిచెరువు గ్రామానికి చెందినవారే. వీరిలో వేదమూర్తికి గతేడాది వివాహమైంది. గతంలో వాలంటీరుగా పనిచేసిన వేదమూర్తి ప్రస్తుతం కె.గంగవరంలో మద్యం దుకాణంలో పనిచేస్తున్నారు. ఇతనిపై భార్య, తల్లిదండ్రులు, సోదరి ఆధారపడి జీవిస్తున్నారు. మేడిశెట్టి వీరబ్రహ్మంకు ఐదేళ్లక్రితం వివాహమైంది. ట్రాక్టరు డ్రైవరుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఒక గ్రామంలో అభంశుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై ఒక వ్యక్తి లైంగిక దాడికి పాల్పడటంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 11న సాయంత్రం ఆరుబయట ఆడుకుంటున్న చిన్నారికి అదే గ్రామానికి చెందిన నల్లూరి శివ (35) మాయమాటలు చెప్పి ఇంటి వెనుక ఉన్న అరటి తోటలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఇంటికి వచ్చిన చిన్నారి జరిగిన విషయం అమ్మమ్మకు తెలిపింది. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో చిన్నారికి కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు జరిపారు. అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు. చిన్నారి తల్లిదండ్రులు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. తల్లి ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటోంది. చిన్నారి ప్రస్తుతం అమ్మమ్మ సంరక్షణలో ఉంది.

ఆటోను ఢీకొట్టిన అనపర్తి మాజీ ఎమ్మెల్యే కారు

నలుగురికి స్వల్ప గాయాలు


దెబ్బతిన్న ఆటో

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రయాణిస్తున్న కారు రామచంద్రపురం మండలం ఎ.అగ్రహారం వద్ద ఆటోను ఢీకొట్టడంతో ఆటో డ్రైవరు, ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆదివారం కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు వస్తున్న ఆయన కారు ఎదురుగా వస్తున్న ఆటో ఒకదానిని ఒకటి తప్పించుకొనే క్రమంలో ఢీకొట్టుకున్నాయి. కారు ముందు భాగం ఆటో వెనుక భాగంలో తగలడంతో ఆటో బోల్తాపడింది. క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్యే తన కారులో కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులను వివరాలు అడగ్గా, ప్రమాదానికి సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

రాయితీపై నిత్యావసర సరకులు

అంబాజీపేట, న్యూస్‌టుడే: ప్రజలకు నిత్యావసర సరకులను రాయితీపై అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తహసీల్దారు జె.వెంకటేశ్వరి అన్నారు. మాచవరం వినాయకుడి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రంలో రాయితీపై వంటనూనెతో పాటు బియ్యం, కందిపప్పు, మినప పప్పు విక్రయిస్తున్నారన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను దిక్కరించి నిత్యావసర సరకులను అధిక ధరలకు విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎంఎస్‌ఓ ఎస్.సత్యనారాయణ, ఆర్ఐ ఏడుకొండలు, కిరాణా వర్తకసంఘం అధ్యక్షుడు కాసు రాజానంద, సభ్యులు పాల్గొన్నారు.

వెండి వీణ బహూకరణ

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట శివారు కొత్తపాలెం సరస్వతీదేవి అమ్మవారికి రాయుడు వెంకటరమణ, విజయమంగాలక్ష్మి దంపతులు శనివారం వెండి వీణను బహూకరించారు. రూ.1.25 లక్షలు విలువ చేసే ఈ వీణను ఆలయ కమిటీ సభ్యులకు వారు అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.





నల్లచెరువు వెంకటేశ్వరస్వామి ఆలయంలో శమీపూజ



అంతర్వేది: సుదర్శన నరసింహ హోమంలో భక్తులు



సఖినేటిపల్లి: పల్లిపాలెంలో తెప్పోత్సవం



అయినవిల్లిలో వాహన పూజలు



మెండుపులంకలో హంస వాహనంపై గ్రామోత్సవం



పల్లకి సేవలో కళాకారుల వేషధారణలు

జ్ఞానప్రదాయిని.. జయం జయం



అప్పనపల్లి ఆలయంలో..

దసరా ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. వివిధ అలంకారాల్లో దుర్గమ్మ దర్శనం భక్తులకు నేత్రపర్వమైంది. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. పలు గ్రామాల్లో అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ మోకా ఆనందసాగర్ నేదునూరులో కనకదుర్గ సమేత చెన్నమల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అంబాజీపేట మండలం మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో ఉద్యాపన, చీరలను వేలం పాటలు నిర్వహించారు. ● పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అంబాజీపేట మండలం మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో నెలకొల్పిన విజయదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. ● అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని అమలాపురం ఆర్డీవో మాధవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ● వాడపల్లి వేంకటేశ్వరుని తోబుట్టువు విజయదుర్గ అమ్మవారికి దేవస్థానం పసుపు, కుంకుమలు, చీరలతో సారె అందజేసింది. మేళతాళాల ఊరేగింపుతో ఆద్యంతం కనులపండువగా ఈ కార్యక్రమం జరిగింది.



ఈతకోటలో కనకదుర్గమ్మ



వాడపల్లి వేంకటేశ్వరుని తోబుట్టువు విజయదుర్గకు సారె తీసుకెళ్తున్న అధికారులు

- న్యూస్‌టుడే, మామిడికుదురు, పి.గన్నవరం, అయినవిల్లి, అంబాజీపేట, మలికిపురం, అంతర్వేది, సఖినేటిపల్లి, రాజోలు, ఆత్రేయపురం, ఆలమూరు, కొత్తపేట, రావులపాలెం గ్రామీణం,

సాయినాథునికి పల్లకి సేవ

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు సాయిబాబా ఆలయంలో బాబాకు శనివారం క్షీరాభిషేకం చేశారు. నాదస్వర కచేరి, విష్ణుసహస్రనామ పారాయణం, సత్సంగం నిర్వహించారు. రాత్రి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. కళాకారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

స.హ.చట్టంపై అవగాహన అవసరం

అంబాజీపేట, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంబాజీపేట మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో శనివారం సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని ఉందుర్తి నాగబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టానికి మించిన ఆయుధం మరోటి లేదన్నారు. దీన్ని అంతా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, నాగాబత్తుల సుబ్బారావు, విత్తనాల ఇంద్రశేఖర్, వీరిన గోపాలం, నక్కా భాస్కర్, కొల్లూరి దివాకర్, ఉగ్రింకి రాంబాబు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రహదారిపై గుంతను పూడ్చారు

స్పందనకు వందనం

మలికిపురం: విశ్వేశ్వరాయపురం- మలికిపురం సరిహద్దులోని సీసీ రహదారిపై ఏర్పడిన గుంతను కాంక్రీటుతో పూడ్చారు. ఇటీవల గుడిమెళ్లంక వంతెన కూడలి వద్ద ప్రధాన రహదారి నుంచి సీసీ రహదారిని అభివృద్ధి చేశారు. అనంతరం రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాన్ని తొలగించి వేరేచోట వేశారు. దాంతో సీసీ రహదారికి మధ్యలో పెద్దగుంత ఉండిపోయింది. ఇది ప్రమాదకరంగా ఉండడంతో ఆ సమస్యను విశ్వేశ్వరాయపురం సర్పంచి చెల్లుబోయిన హెలీనా దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆమె ఈ గుంతను పూడ్చించి సమస్యను పరిష్కరించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

విద్యుత్తు ఫిర్యాదుల కేంద్రం ప్రారంభం



రాజోలు: రాజోలులో విద్యుత్తు వినియోగదారుల ఫిర్యాదు కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంపై ఆగస్టు 22న 'శిథిలమైనా పట్టించుకోరా..' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పాడైన కేంద్రానికి మరమ్మతులు చేపట్టి ఆధునికీకరించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ సత్తిబాబు శనివారం ప్రారంభించారు.

ఈనాడు కథనానికి స్పందన

ఆక్రమణలే అడ్డంకులు..

రాజోలు నియోజకవర్గంలో డ్రెయినేజీ వ్యవస్థ పలుచోట్ల ఆక్రమణల బారిన పడి అస్తవ్యస్తంగా మారింది. ఉప డివిజన్ పరిధిలో వివిధ డ్రెయిన్లు దాదాపు 550 కిలోమీటర్ల విస్తరించి ఉన్నాయి. ఆక్రమణలను తొలగించే దిశగా ప్రత్యేకంగా దృష్టి పెట్టకపోవడంతో ముప్పుగా మారుతోంది.

- న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు

ఆక్వా చెరువుల సాగుతో డ్రెయిన్లు ఉనికి కోల్పోయే ప్రమాద పరిస్థితులకు చేరువయ్యాయి. రాజోలు నియోజకవర్గంలోని శంకరగుప్తం, గోగన్నమఠం, కడలి, వేపచెట్టు, కూనవరం, వాడబోది, వాడ్రేవుపల్లి తదితర మధ్య, చిన్నతరహా డ్రెయిన్లు ఆక్రమణలకు గురయ్యాయి. ఉపడివిజన్ పరిధిలో 1,630 ఆక్రమణలను అధికారులు గుర్తించారు. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌కు సమాంతరంగా కరవాక నుంచి 12 కిలోమీటర్ల మేర ఉన్న గోగన్నమఠం డ్రెయిన్ ఆక్రమణల కారణంగా ముంపునీటి సమస్య జటిలమైపోయింది. 32 మీటర్ల వెడల్పుతో ఉండే ఈ డ్రెయిన్ దాదాపు 8 కిలోమీటర్లకు గాను 3 మీటర్లకు కుచించుకుపోయింది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దీనిపై పరిశీలన చేసి దాని ప్రక్షాళన దిశగా చర్యలకు కలెక్టర్‌కు విన్నవించారు. ఆక్రమణల నుంచి విముక్తి వస్తే శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌పై భారం తగ్గి ముంపునీటి సమస్యలు దాదాపు పరిష్కారమవుతాయని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. కత్తిమండ, మొగలికుదురు డ్రెయిన్లలో పూడికతీతకు ఓఅండ్‌ఎంలో రూ.99 లక్షలు మంజూరయ్యాయి. మరో అయిదు డ్రెయిన్లలో అత్యవసర పూడికతీత పనులు సహా కుంగిపోతున్న గట్ల పటిష్టానికి రూ.14 కోట్ల వ్యయమయ్యే ప్రతిపాదనలు చేసి పంపినా ఆమోదం లేకపోవడంతో సమస్య మరింత క్లిష్టతరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. డ్రెయిన్లలో పారుదలకు అడ్డంకిగా ఉన్న వ్యర్థాలు, తుంగజాతి కలుపు నివారణకు రూ.95 లక్షలతో 19 చోట్ల చేపట్టిన పనులను పటిష్ఠంగా పూర్తి చేస్తేనే వాటికి మోక్షం చేకూరుతుంది.



చెత్తతో నిండిన సోంపల్లి కాలువ..



కుచించుకుపోయిన గోగన్నమఠం కాలువ

తొలగింపునకు కార్యాచరణ

ఆక్రమణల తొలగింపునకు త్వరలోనే కార్యాచరణ జరగనుంది. వీటిపై సమగ్ర వివరాలను కలెక్టర్‌కు నివేదించాం. రెవెన్యూ, జలవనరులు, మత్స్య, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో వీటిపై చర్యలకు ఉపక్రమించాల్సి ఉంది. నిధులు మంజూరైన డ్రెయిన్లకు సంబంధించి పూడికతీత పనులు చేపడతాం. 19 డ్రెయిన్లలో తుంగ, గుర్రపుడెక్క పూర్తిగా నిర్మూలించి మురుగునీరు సజావుగా పారేలా చేపట్టిన పనులను డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం.

- ఆర్.నాగార్జున, డీఈఈ, రాజోలు

పరుగులో ప్రథమ స్థానం



నాగశ్రీరామరాజు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: గుంటూరులో ఆదివారం జరిగిన ఇండియా పోస్ట్ రన్‌లో లొల్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు దాట్ల నాగ శ్రీరామరాజు 5 కి.మీ పరుగును కేవలం 19 నిమిషాల్లో పూర్తిచేసి వెటరన్ విభాగంలో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. విశాఖపట్నంలో ఇటీవల జరిగిన హాఫ్ మారథాన్‌లో ప్రతిభ చాటి డిసెంబర్ 8న తణుకులో నిర్వహించనున్న రోడ్ రన్‌కు అంబాసిడర్‌గా నియమితులయ్యారు. శ్రీరామరాజును ఎంపీడీవో రామన్ తదితరులు అభినందించారు.

వాసవీ సేవలు ప్రశంసనీయం: ఎమ్మెల్యే దేవ

రాజోలు, న్యూస్‌టుడే: వాసవీక్లబ్ సేవలు ప్రశంసనీయమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం వాసవీ రీజియన్ ఛైర్‌పర్సన్ రాజా నాగరత్నకుమార్ అధ్యక్షతన రాజామృత వర్షిణి-సేవాసుధ అనే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, బహుమతులు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులను సత్కరించారు. మరో ముఖ్యఅతిథి వాసవీ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బోడా సాయిసూర్యప్రకాశ్, డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.ప్రవీణ్, వాడ్రేవు పాపయ్య పంతులు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, సర్పంచి రేవు జ్యోతి, ఉప సర్పంచి పామర్తి రమణ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా ప్రజలనే నమ్ముకుంది: మాజీ మంత్రి గొల్లపల్లి

మలికిపురం: మలికిపురంలో వైకాపా నూతన కార్యాలయాన్ని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రజలను నమ్ముకున్న పార్టీ అని, రానున్న కాలంలో పార్టీకి పూర్వవైభవం వస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో భ్రమలు వీడుతున్నాయని, పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని తీవ్రంగా విమర్శలు చేశారు. సఖినేటిపల్లి ఎంపీపీ వీరా మల్లిబాబు, పార్టీ మండల అధ్యక్షులు అడబాల బ్రహ్మాజీ, కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీను పాల్గొన్నారు.

కూటమి పాలనలో అందరికీ సంక్షేమం: ఎంపీ హరీష్

మామిడికుదురు: కూటమి పాలనలో అందరికీ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, అభివృద్ధి పనులతో గ్రామాలు ఎంతో అభివృద్ధి సాధిస్తాయని అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్ అన్నారు. మండలంలోని అప్పనపల్లి విచ్చేసిన ఆయన ఆదివారం స్థానికంగా ఉన్న సాయివీరభద్ర, కనకమహాలక్ష్మి, బాలబాలాజీస్వామి ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. స్థానికులతో కాసేపు మాట్లాడారు. ఆయన వెంట కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

దాతకు సన్మానం

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి మండలం మోరి 167 అంగన్‌వాడీ కేంద్రానికి శుద్ధజల పరికరం, పైపులైను, మోటారు తదితర మౌలిక సౌకర్యాలు సమకూర్చిన జానా ఉమాదేవిని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడీపీవో రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం ఘనంగా సన్మానించారు. స్థానికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వాడపల్లి ఆలయంలో శనివారం రాత్రి ఏర్పాటైన సంగీత నృత్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాజమహేంద్రవరం, కాకినాడ, హైదరాబాద్ వంటి నగరాలకు చెందిన కళాకారులు చేసిన కూచిపూడి, భరత నాట్యం, అన్నమాచార్య సంకీర్తనలు అలరించాయి. కళాకారులకు దేవస్థానం జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించి సత్కరించింది.

రావులపాలెం డిపోనకు 5 కొత్త బస్సులు



నూతన బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, న్యూస్‌టుడే: ప్రయాణికుల ఇక్కట్లు తీర్చేందుకు ప్రభుత్వం నూతన బస్సులను అందుబాటులోకి తెచ్చిందని, రావులపాలెం డిపోనకు అయిదు వచ్చాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. మరో అయిదు లగ్జరీ బస్సులు కూడా వస్తాయన్నారు. వర్షాలకు రావులపాలెం డిపో ముంపునకు గురవకుండా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. డిపోను ఆధునికీకరణ చేస్తామన్నారు. ఎన్నికల ముందు హామీ ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టారని, త్వరలో కార్యాచరణలోకి వస్తుందని తెలిపారు. బండారు బులితాత, చీకట్ల అబ్బు, కడియం చిన్నా, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వంతెన



కడలిలో చొప్పలవారిమెరక మురుగు కాలువపై ఉన్న ప్రధాన వంతెన శిథిలావస్థకు చేరింది. కింది బాగంలో పెచ్చులూడి, పిల్లర్లు కుంగి ప్రమాదకరంగా ఉంది. ఏడు గ్రామాల ప్రజలు ఈ వంతెన పైనుంచే రాజోలుకు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ వంతెన ఎప్పుడు కూలుతుందోనని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డ్రెయిన్స్ ఏఈ ఆనంద్‌ను వివరణ కోరగా, గత ప్రభుత్వ హయాంలో అంచనాలు పంపించినా అనుమతులు రాలేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కొత్త వంతెన నిర్మాణానికి కార్యాచరణ చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, రాజోలు

ప్రయాణం.. ప్రహసనం



పల్లెల్లో పుంత మార్గాలు అధ్వాన స్థితికి చేరి చినుకు పడితే బురద కయ్యాల్లా మారిపోతున్నాయి. ఆత్రేయపురం, ర్యాలి నుంచి మెర్లపాలెం, తాడిపూడి నుంచి లింగంగారి చేను మీదుగా కట్టుంగ, దబ్బపుంత, కట్టుంగ, అమలాపురం కాలువ గట్టు మీదుగా పాటిచెరువు తదితర గ్రామాల్లో కొన్ని పుంత మార్గాల వెంబడి ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. గతంలో ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లపై వ్యవసాయ ఉత్పత్తులను అన్నదాతలు సాఫీగా తరలించుకునేవారు. కొన్నేళ్లుగా అభివృద్ధి లేకపోవడంతో పుంతదారులు అధ్వానంగా తయారై అవస్థలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా రూ.లక్షల్లో పన్ను వసూలు చేస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు పుంత మార్గాల నిర్వహణను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇటీవల వర్షాలకు పుంత మార్గాల్లో వాహనాలు దిగబడిపోవడంతో రవాణా వ్యయం పెరిగిపోతోందని అంటున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో వెంకటరామన్ వద్ద ప్రస్తావించగా, సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, ఆత్రేయపురం

సభ్యత్వాలే పార్టీ పటిష్టతకు ప్రామాణికం



వాలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవ

మలికిపురం, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదే పార్టీ పటిష్టతకు ప్రామాణికమని, జనసేనకి అత్యధిక క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేయడంలో కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం మలికిపురంలో జరిగిన నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశంలో క్రియాశీల సభ్యత్వాలు నమోదు చేయడానికి కృషిచేసిన వాలంటీర్లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఐటీ విభాగంలో మండల, గ్రామ కోఆర్డినేటర్లను నియమించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, లింగోలు పెద్దబ్బులు, మార్క్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి గెడ్డం మహాలక్ష్మీ ప్రసాద్, మండల శాఖ అధ్యక్షులు గుబ్బల ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రతన్‌టాటాకు నివాళులు



నివాళులర్పిస్తున్న చిట్టిబాబు తదితరులు

మామిడికుదురు, న్యూస్‌టుడే: పారిశ్రామికవేత్త రతన్‌టాటా దేశ ప్రజలందరి హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచారని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నగరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కె.వెంకటేశ్వరరావు, స్టాలిన్‌బాబు, మట్టా సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నుంచి కాంగ్రెస్‌లోకి..

మామిడికుదురు, న్యూస్‌టుడే: రాజోలు నియోజకవర్గంలోని వైకాపా మాజీ కోఆర్డినేటర్ మత్తి జయప్రకాశ్ తన అనుచరులతో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు నగరంలో వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ఆరిఫ్, చిలకపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువకు గండి



కట్టుంగ కాలువ రేవులో పంట కాలువకు ఆదివారం గండి పడటంతో సాగునీరు వృథాగా మురుగు కాలువలోకి పోతోంది. పంట కాలువకు ఎగువన ఉన్న అంకంపాలెం తదితర ప్రాంతాల పొలాలకు సాగునీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ తరచూ గండి పడి నీరు పోతున్నా అధికారులు కట్టుదిట్ట చర్యలు తీసుకోలేదని రైతులు చిట్టూరి మురళి, శ్రీను తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చేలు ఈనిక, గింజ గట్టిపడే దశలో ఉన్నందున సాగునీరు అవసరమన్నారు. ఈ విషయాన్ని జలవనరుల శాఖ ఏఈఈ వెన్నా సాయిప్రసన్న వద్ద ప్రస్తావించగా గండి పూడ్చివేసి రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

-న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ఎమ్మెల్యే బండారు ప్రజాదర్బార్ నేడు

రావులపాలెం పట్టణం: రావులపాలెం, రావులపాడు, ఊబలంక, కొమరరాజులంక ప్రాంతాలకు సంబంధించి రావులపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజాదర్బార్ నిర్వహిస్తారని కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రజలు అర్జీలు అందించాలని కోరారు.



అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

ముగిసిన యానాం మీసాల వెంకన్న బ్రహ్మోత్సవాలు

యానాం, న్యూస్‌టుడే: యానాంలోని మీసాల వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 4న ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాల్లో వివిధ వాహన సేవలు, స్వామివారికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. ఆలయం వద్ద శనివారం రాత్రి నాటక ప్రదర్శన నిర్వహించారు. ముగింపు వేడుకల్లో దిల్లీలోని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఉదయలక్ష్మి దంపతులు పూర్ణాహుతి, యాగం క్రతువులో పాల్గొన్నారు. యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, ఆలయ అధికారి ఖండవిల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

భట్లపాలెంలో రాములోరి కల్యాణం


కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

అమలాపురం గ్రామీణం: భట్లపాలెంలో సీతారాముల కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమికి నిర్వహించాల్సిన రాములవారి కల్యాణాన్ని ఇక్కడ విజయదశమి రోజున నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు.

పురస్కార గ్రహీతకు అభినందనలు

అమలాపురం గ్రామీణం: నడిపూడి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న అనంతలక్ష్మికి ఇటీవల స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఉత్తమ పురస్కారం లభించడంతో ఆమెను ఆదివారం గ్రామంలో సత్కరించారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేయించడంలో ఆమె చేస్తున్న సేవలను సర్పంచి చెల్లుబోయిన వెంకటేశ్వరరావు అభినందించారు. ఉపసర్పంచి సాంబ, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ బొక్కా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండగ ప్రారంభం

నేడు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చేపట్టిన పల్లె 'పండగ-పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమాన్ని సోమవారం ముమ్మిడివరం మండలం అనాతవరం నుంచి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రారంభించనున్నట్లు మండల ఇంజినీరింగ్ అధికారి పి.శ్రీనివాసరావు తెలిపారు. 14వ తేదీ ఉదయం అనాతవరం, సీహెచ్ గున్నేపల్లి, అయినాపురం, కొత్తలంక, చినకొత్తలంక, మర్లపాలెం, కర్రివానిరేవు గ్రామాల్లో.. మధ్యాహ్నం గాడిలంక, ఠాణేలంక, గేదెల్లంక, కొమానపల్లి, అన్నంపల్లి గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారన్నారు. మండలంలో రూ.2.69 కోట్లుతో 28 పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేస్తారని శ్రీనివాసరావు వివరించారు.

పట్టణంపై మరింత నిఘా

జిల్లా కేంద్రంలో కొత్తగా ఎనిమిది చోట్ల సీసీ కెమెరాలు

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

జిల్లా కేంద్రం అమలాపురంలో నిఘా పెంచే దిశగా పోలీసు శాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా కొత్తగా ఎనిమిది చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 25 చోట్ల సీసీ కెమెరాలు ఉన్నాయి.

కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసే ప్రాంతాలు

గడియారస్తంభం	:	2
హైస్కూల్ కూడలి	:	1
ముమ్మిడివరం గేటు	:	3
బ్యాంకు వీధి	:	1
కొంకాపల్లి	:	1

అమలాపురం వివరాలు

పట్టణ జనాభా	:	60 వేలు
నిత్యం పట్టణానికొచ్చే జనాభా	:	50 వేలు

చోరీల నియంత్రణ

చోరీ కేసుల్లో నిందితులను, రోడ్డు ప్రమాద సమయాల్లో సంబంధిత వాహనాలను గుర్తించేందుకు ఈ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. గతంలో జరిగిన అనేక ఘటనల్లో పోలీసులకు ఈ నిఘా వ్యవస్థే కీలకంగా మారింది.


ఎర్రవంతెన వద్ద గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

పర్యవేక్షణ పెంచేలా..

అమలాపురం పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోంది. శాంతిభద్రతలు కాపాడటంలో పోలీసు సిబ్బంది ఎంత ముఖ్యమో సీసీ కెమెరాలూ అంతే అవసరం. కాలనీల్లో నిఘా నేత్రాలు ఏర్పాటుచేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

నేరాల నియంత్రణలో కీలకం..



అమలాపురం పట్టణంలోని సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. కీలక సమయాల్లో నేరాల నియంత్రణకు ఉపయోగపడుతున్నాయి. పట్టణంలో కొత్తగా ఎనిమిది చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం.
– పి.వీరబాబు, సీఐ, అమలాపురం పట్టణం


నక్కారామేశ్వరంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నాయకులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అల్లవరం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే ఆనందరావు పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. కొమరగిరిపట్నం, నక్కారామేశ్వరం గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇసోందన్నారు. మెట్ల రమణబాబు, సర్పంచి రాకాపు విజయలక్ష్మి, దెందుకూరి సత్తిబాబురాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాట్రేనికోన: మండలంలో రూ.2.82 కోట్ల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 48 చోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శంకుస్థాపన చేయనున్నారని మండలజేఈ ఫకీర్ తెలిపారు.

అమ్మ ఉత్సవం.. ఆధ్యాత్మిక పరవశం


ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతంలో అమ్మవారి ఊరేగింపు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా వాడవాడలా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం అమ్మవార్లు శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీదేవీ అమ్మవారిని ఆదివారం శ్రీ శైలపుత్రి రూపంలో అలంకరించారు. శ్రీకామాక్షి పీఠంలో అమ్మవారి ఆలయ ప్రాంగణాలలో చండీహోమం, కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయాల్లో అన్నసమారాధన నిర్వహించారు.

● స్థానిక ఓ.శంకరి కేంద్రంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో చైతన్య దేవీల దివ్య దర్శన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్ ప్రాంతం, పెద్దవంతెన, అగ్రహారం, క్రాపచింతలపూడి పాలెం, కొండాలమ్మచింత, మండలంలోని అనాతవరం, గోదశివారి పాలెం, రాజీ లంక, దేవీ సెంటర్, గాడిలంక, కొత్తలంక, చినకొత్తలంక, కొమానపల్లి, గేదెల్లంక, పల్లవారిపాలెం, సీహెచ్ గున్నేపల్లి తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. శనివారం అమ్మవారికి శమీ పూజ చేశారు. ఈ సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. మార్కెట్ ప్రాంతంలోని కనకదుర్గమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దర్శించుకున్నారు.




మురమళ్ల: జమ్మి వృక్షం వద్ద పూజలు


ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో శమి పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. జమ్మి వృక్షం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన సూరంపూడి జయశంకర్ మణిప్రకాష్ రూ.10వేలు అందజేశారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న మల్లాడి కృష్ణారావు

యానాం: యానాంలోని లలితాదేవి, శారదాదేవి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల వద్ద దశమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

ఉప్పలగుప్తం: డప్పు వాయిద్యాలు, గరగనృత్యాల నడుమ అమ్మవార్లను ఊరేగించారు. విలసవిల్లి రామాలయంలో చండీహోమం నిర్వహించారు.



అలంకరణలో అమలాపురంలోని శ్రీదేవి అమ్మవారు, వాసవీ కన్యకాపరమేశ్వరి


కొండాలమ్మచింత వద్ద అమ్మవారు


కుండలేశ్వరంలో..


రవణంవీధిలో శ్రీమహిషాసురమర్దని అమ్మవారు

వైభవంగా వాహనాల ఊరేగింపు


అబ్బిరెడ్డి చెడీతాలింఖానా వద్ద ఎమ్మెల్యే ఆనందరావు, తెదేపా నాయకులు


నల్లావీధిలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జనసేన, తెదేపా నాయకులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: దశమి ఊరేగింపు సందర్భంగా పట్టణంలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే ఊరేగింపుల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొంకాపల్లి ఐరావతం వాహనం (ఏనుగు అంబారి) రాజహంస, ఆంజనేయస్వామి (అంబారీ) వాహనం, మహిపాల వీధి రాజహంస, గండువీధి శేషశయన, రవణంవీధి మహిషాసురమర్దని అమ్మవారు, నల్లవీధి శ్రీవిజయదుర్గ వాహనం, రవణంమల్లయ్య వీధి గరుడ వాహనం, శ్రీరామపురం హంస, శ్రీకృష్ణుడు, వినాయక వాహనాలను ఊరేగించారు. బ్యాండుమేళాలు, దీపాలంకరణ మధ్య చెడీతాలింఖానా విన్యాసాలతో జై భేతాళ.. జైజై భేతాళ అంటూ నినదిస్తూ విన్యాసాలు చేశారు.

పారిశుద్ధ్యం అధ్వానం


కొంకాపల్లిలో మురుగుకాలువ పరిస్థితి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలోని కొంకాపల్లి పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మురుగుకాలువలు, ఖాళీస్థలాల్లో మురుగు నిల్వ చేరింది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ 5 డెంగీ కేసులు నమోదు అయ్యాయని వైద్యాధికారులు తెలిపారు.


రోడ్డుపైకి మురుగు


విద్యుత్తునగర్‌లో రహదారి దుస్థితి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షానికి అమలాపురం పట్టణంలో సావరం, విద్యుత్తునగర్ మురుగుకాలువలు మునిగి రోడ్లపైకి వస్తున్నాయి. వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చూసి వెళ్లడమే కాని సమస్యను పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కాట్రేనికోన: ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన గోపాలరావుపేటలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలరావుపేటకు చెందిన అయితాబత్తుల అప్పలస్వామి(68) ఆదివారం పొలం వెళ్లి స్థానిక రోడ్డుపై వస్తుండగా పల్లం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అవినాష్ తెలిపారు.



ముమ్మిడివరం: అన్నంపల్లి లక్ష్మీదేవిలంక వద్ద 216 జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. యానాంకు చెందిన అద్దంకి అప్పారావు (50) అన్నంపల్లి లక్ష్మీదేవిలంక వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. గాయపడిన ఆయనను అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు అప్పారావుకు భార్య నాగవల్లి, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగించే అప్పారావు మృత్యువాత పడటంతో ఆ కుటుంబం ఆధారం కోల్పోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడు..

మసీదు సెంటర్(కాకినాడ): ఉప్పలగుప్తం మండలం పెదగోడవల్లికి చెందిన ఎం.దిలీప్‌కుమార్(24) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. వ్యక్తిగత కారణాలతో గడ్డిమందు తాగిన ఘటనలో ప్రథమచికిత్స అనంతరం ఈనెల 12న రాత్రి జీజీహెచ్‌లో చేర్చారు. దీనిపై ఉప్పలగుప్తం పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: గోవాలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ముమ్మిడివరం విద్యార్థులు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ విభాగంలో దొమ్మేటి సాగర్, జూనియర్ విభాగంలో దొమ్మేటి వేణు మణికంఠ, మేడిద సందీప్, వాసంశెట్టి లవకుమార్, అప్పాడి బాలు ఎంపికయ్యారు. విద్యార్థులను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కోచ్ వాసంశెట్టి నరేష్ అభినందించారు.

పుదుచ్చేరి విజయం


షణ్ముకప్రియ

యానాం: పుదుచ్చేరిలో నిర్వహించిన అత్య-పత్యా జాతీయ స్థాయి పోటీల్లో ఆతిథ్య జట్టు పుదుచ్చేరి విజేతగా నిలిచింది. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించిన షణ్ముకప్రియను పలువురు అభినందించారు.

ముగిసిన బాల్‌బ్యాడ్మింటన్..

యానాం: యానాం బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 11,12వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగిసింది. ఏపీలోని కర్నూలు, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని జట్లుతో పాటు యానాం జట్టు ఈ పోటీల్లో తలపడ్డాయి. అజ్జాపురం, నునపర్తి, విజయవాడ, బిక్కవోలు, యానాం జట్లు విజేతలుగా నిలిచినట్లు బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శశేష సుమన్ తెలిపారు. విజేతలకు ట్రోఫీ, జ్ఞాపికలు అందజేశారు.


విజేతలకు జ్ఞాపికలు అందజేత

విద్యార్థులకు అపార్ కార్డులు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నూతన మార్పులు తీసుకొస్తోంది. ప్రతి విద్యార్థికి ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ పేరిట కేంద్ర విద్యాశాఖ 12 అంకెలతో కూడిన కార్డు మంజూరు చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించారు.

అపార్ పేరుతో..: ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజస్ట్రీ(ఏపీఏఏఆర్) పేరుతో ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో కూడిన కార్డులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీటిలో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్య ఉంటాయి.



విద్యార్థులకు అందించే నమూనా కార్డు

9, 10 తరగతులు వారికి: కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న అపార్ కార్డులను తొలుతగా 9, 10 తరగతుల వారికి అందించనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తొమ్మిదో తరగతి వారు 20,430 మంది, పదో తరగతి వారు 19,683 మంది ఉన్నారు. వీరి తర్వాత మిగిలిన తరగతుల వారి వివరాలు నమోదు చేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ కార్డులు అందించేందుకు తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రాలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. తొలి విడత పూర్తికాగానే మిగిలిన తరగతులకు, పీజీ వరకు జారీ చేయనున్నారు.

ఇవీ ప్రయోజనాలు: విద్యార్థులు వివిధ కారణాలతో పలు పాఠశాలలు మారుతూ ఉంటారు. అపార్ గుర్తింపు సంఖ్య ద్వారా వివిధ రాష్ట్రాల్లోని బోర్డులతో ఏకీకృత వ్యవస్థగా పని చేస్తుంది. ఒక విద్యాసంస్థ నుంచి మరో పాఠశాలకు మారిన సమయంలో ఏవిధమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ఇది దోహదపడుతుంది.

వివరాలు నమోదు చేస్తున్నాం..

అపార్ కార్డులకు సంబంధించి విద్యార్థుల వివరాలు యూడైస్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. వీటిని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాగిన్ నుంచి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. అనంతరం విద్యార్థికి 12 అంకెలతో కూడిన కార్డులు మంజూరవుతాయి.
– కమల కుమారి, డీఈవో

మౌలిక వసతుల కల్పనకు కృషి


కల్యాణమండపం పనులకు శిలాఫలకం ఆవిష్కరణ

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఉప్పలగుప్తంలో కూటమినాయకులు, గ్రామస్థులతో కలిసి శనివారం కల్యాణమండపం పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత భీమనపల్లిలో జరిగిన జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం చినగాడవిల్లిలో కనదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమస్యపై ఎంపీకి వినతి


వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: ఉప్పూడిలో ఓఎన్‌జీసీ పాత బావి లీజు, గతంలో రైతులకు ఇస్తామన్న నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఇటీవల రెండురోజులపాటు గ్రామంలో స్థానికులు ధర్నా నిర్వహించారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సర్పంచి రంబాల రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆదివారం ఎంపీ హరీష్‌మాథుర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై ఓఎన్‌జీసీ అధికారులు, తాను, గ్రామస్థులు కలిసి చర్చించిన అనంతరం ఈ విషయాన్ని కేంద్రమంత్రితో మాట్లాడతానని ఎంపీ తెలిపారన్నారు. రంబాల దొరబాబు, బొబ్బిలి పాపారావు, చౌదరిబాబు, జొన్నాడ రాజారావు, నాగబాబు, అర్జునరావు, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

సముద్రతీరంలో పర్యాటకుల సందడి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: సెలవురోజులు కావడంతో మండలంలోని సముద్రతీరాల్లో పర్యాటకులు సందడి చేస్తున్నారు. నీలరేవు, చిర్రయానం, గచ్చకాయలపోర సముద్రతీరాల్లో శని, ఆదివారాల్లో పలువురు పర్యాటకులు కుటుంబసభ్యులతో వచ్చి సముద్రస్నానాలు చేసి సంతోషంగా గడిపారు. తీరం పొడవునా సందడి వాతావరణం నెలకొంది. సమీపంలోని కాలభైరవుని ఆలయంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.



నిర్లక్ష్యం అల్లుకుంది

పలుచోట్ల విద్యుత్తు స్తంభాలకు పొదలు అల్లుకున్నాయి. గాలులు వీచినప్పుడల్లా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటుపక్క వెళ్లే పశువులు, మనుషులకు ప్రమాదం పొంచి ఉంది. కిత్తనచెరువు గ్రామంలో స్తంభాలకు పొదలు అల్లుకున్న చిత్రమిది. ఈ విషయాన్ని ఆ శాఖ ఏఈ శ్రీహరి దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం



అడుగుకో గుంత

యానాం ముఖద్వారంలోని పొట్టి శ్రీరాములు వారధి ఏళ్ల తరబడి నిర్వహణ కొరవడి గుంతలమయంగా మారింది. ప్రజాపనుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, యానాం



రహదారి అధ్వానం.. ప్రయాణం నరకం

అమలాపురం పట్టణంలోని కలెక్టరేట్ నుంచి ముక్తేశ్వరం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఎ.వేమవరప్పాడు వద్ద గుంతలమంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షపునీరు చేరి గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా రహదారికి కనీస మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

మండపేట

•మండపేట • రామచంద్రపురం

ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: బస్సులు, షేర్ ఆటోల్లో ప్రయాణించేటప్పుడు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండపేట రూరల్ ఎస్సై దొరరాజు అన్నారు. ఆదివారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు దొంగలు తోటి ప్రయాణికుల్లా ప్రయాణిస్తూ ఒంటిపై ధరించిన బంగారు వస్తువులు, బ్యాగులు కత్తిరించి చాకచక్యంగా దొంగిలిస్తున్నారన్నారు. వస్తువులను ఎప్పటికప్పుడు గమనించుకోవాలని సూచించారు. అపరిచితులు పెట్టిన తినుబండాలను తినకూడదన్నారు. సెల్‌ఫోన్‌లో నిమగ్నం కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినా, వస్తువులు పోయినా వెంటనే 112కి గానీ, దగ్గర్లోని పోలీసు స్టేషన్‌కుగాను ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రకటన బోర్డు వద్దే చెత్త..



తాపేశ్వరం శివాలయం పక్కన చెత్త, వ్యర్థాలు వేయకూడదంటూ ఏర్పాటు చేసిన బోర్డు ప్రకటనకే పరిమితమయ్యింది. అక్కడ స్థానికులు చెత్తాచెదారం వేస్తుండటంతో పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి చక్రధరరెడ్డిని వివరణ కోరగా, పరిస్థితిపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటామన్నారు. అక్కడ చెత్త వేస్తే కఠిన చర్యలు చేపడతామని తెలిపారు.

– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం



రామచంద్రపురంలో పంచముఖ ఆంజనేయస్వామి దీపాలంకరణ

అంబరాన్నంటిన ఏనుగుల సంబరం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ఏటా దసరా పండుగ తర్వాత రోజు జరిగే రామచంద్రపురం ఏనుగుల సంబరం ఆదివారం రాత్రి అంబరాన్నంటింది. కొత్తూరు రోడ్డులో అమ్మవారిని ఏనుగు విద్యుత్ దీపాలంకరణ వాహనంపై ఊరేగించారు. ట్రాక్టర్‌పైనా కరెన్సీ నోట్లతో అమ్మవారి ఊరేగింపు ఆకట్టుకుంది. సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

ద్రాక్షారామ: స్థానిక కర్రివారి వీధి, నున్నవారి వీధి, వెలంపాలెం బుర్రా వీధుల్లో శనివారం రాత్రి ఏనుగుల సంబరం కోలాహలంగా జరిగింది. భారీ బొమ్మ ఏనుగులకు విద్యుద్దీపాలంకరణ చేసి తెల్లవార్లూ ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం జమ్మిచెట్టు వద్ద పూజలు చేసి సంబరాన్ని ప్రారంభించారు. ఏనుగుల ఊరేగింపు ముందు బ్యాండు మేళాలు, తీన్‌మార్ డ్యాన్సులు, కర్రసాము, బొమ్మల వేషాలతో సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.

కాజులూరు: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని గొల్లపాలెంలో ఏనుగుల సంబరం ఘనంగా నిర్వహించారు. గడ్డితో చేసిన పెద్ద ఏనుగు బొమ్మను శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు చెక్కతో తయారు చేసిన చిన్న ఏనుగును ట్రాక్టరుపై ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ ఏనుగులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గరగ నృత్యాలు, కోల సంబరాలు, కోయ డ్యాన్సులు, గారడీ, బ్యాండ్ మేళాలతో ఏనుగుల సంబరం కోలాహలంగా సాగింది. గొల్లపాలెం పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తిలకించారు. గొల్లపాలెం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



గొల్లపాలెంలో ఏనుగు బొమ్మ ఊరేగింపు

ఆక్రమణల తొలగింపు దిశగా అడుగులు

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

న్యూస్‌టుడే – మండపేట

మండపేట పట్టణంలో కొందరు వ్యాపారులు రోడ్డు మార్జిన్లను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో ప్రధాన రహదారుల్లో పార్కింగ్ సమస్య తీవ్రంగా మారింది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆక్రమణల కారణంగా వాహనాల రాకపోకలు నియంత్రించడం కష్టతరమవుతోంది. ట్రాఫిక్ రద్దీతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారంపై పురపాలక సంఘం దృష్టి సారించి ఆక్రమణల తొలగింపునకు నడుం బిగించింది. ఇటీవల కౌన్సిల్ నిర్ణయం మేరకు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఆక్రమణల తొలగింపుపై అధికారులు దృష్టి సారించారు.



బస్టాండ్ సమీపంలో మున్సిపల్ దుకాణాల వద్ద..

రహదారికి రెండు వైపులా..

మండపేట బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ దుకాణాల సముదాయంలో ఫ్యాన్సీ, ఎలక్ట్రికల్, ఫర్నిచర్, గృహోపకరణాలకు సంబంధించిన దుకాణాలు అధికంగా ఉన్నాయి. వినియోగదారులను ఆకర్షించేందుకు దుకాణం వద్ద కనీసం 10 అడుగులు ముందుకు వచ్చి రోడ్డు మార్జిన్‌లో సామగ్రి, గృహోపకరణాలను ప్రదర్శిస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఒకరిని మించి మరొకరు వ్యాపారులు ముందుకు రావడంతో రహదారి మొత్తం ఆక్రమణకు గురై వాహనాలు తప్పించుకునే పరిస్థితి లేదు. గత కౌన్సిల్‌లో సభ్యులు దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు కఠినంగా చర్యలు తీసుకుంటే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదని స్పష్టం చేశారు. తర్జనభర్జనల అనంతరం అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తే ఆక్రమణల తొలగింపు సాధ్యమవుతుందన్న భావనకు వచ్చారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అడ్డుపెట్టకుండా ఉంటే వారి పని వారు సజావుగా చేసుకుపోతారని భావించారు. ఆ మేరకు రహదారి విస్తరణ పనుల్లో అనుభవం ఉన్న ఇటీవల కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావుకు ఆక్రమణల తొలగింపు బాధ్యతలు అప్పగించారు. ముందుగా మార్జిన్‌లో ఆక్రమణలు తొలగించడంతోపాటు ప్రచార బోర్డులను సైతం గ్యాస్ కట్టరుతో తొలగించే పనులు చేపట్టారు. రాజకీయ నాయకులు జోక్యం చేసుకోకపోవడంతో సచివాలయ ఉద్యోగులు, పట్టణ ప్రణాళిక అధికారులు చేపట్టిన తొలగింపు పనులు సజావుగా సాగుతున్నాయి.



రోడ్డు పక్కన ఖాళీ చేసిన తరువాత ఇలా.

ఇరుకుగా రహదారులు..

మార్జిన్‌లు ఆక్రమించిన వ్యాపార ప్రకటన బోర్డులను, సామగ్రిని తొలగించడంతోపాటు కొన్ని అక్రమ నిర్మాణాలను సైతం తొలగించాలని స్థానికులు పలువురు అభిప్రాయపడుతున్నారు. కలువపువ్వు సెంటరులో వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద దుకాణాలు డ్రైనేజి మార్జిన్‌పై ఏర్పాటు చేయడం వల్ల ఇరుకుగా మారింది. ఆటోలు సైతం అక్కడే నిలుపుదల చేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. సంకావారి వీధి ఇరుకు సందులా ఉంటుంది. ఈ వీధిలో 150కిపైగా నగలు తయారు చేసే దుకాణాలు, నగల వర్తకుల దుకాణాలు ఉన్నాయి. వ్యాపారులతోపాటు వినియోగదారులు సైతం దుకాణాలకు రెండు వైపులా ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఏ సమయంలో వెళ్లినా రహదారి ఇరుకుగా ఉంటుంది. ఇక్కడ వాహనాల నిలుపుదలను నియంత్రించి రహదారిలో రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు. గుమ్మిలేరు రోడ్డులో ఐటీఐ కళాశాల సమీపంలో పరిశ్రమకు సంబంధించిన నిర్మాణం డ్రైను ఆక్రమించడంతోపాటు రోడ్డు మార్జిన్ వరకు విస్తరించి ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిరంతరం కొనసాగుతుంది



రహదారి మార్జిన్లలో ఆక్రమణలు, ప్రకటన బోర్డులు తొలగించే పని జరుగుతోంది. ఆక్రమణలు ఎక్కువగా ఉంటే నిర్మాణాలను సైతం తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- టీవీ రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట

తెదేపాలో చేరిన కౌన్సిలర్



సతీష్‌తో ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

మండపేట, న్యూస్‌టుడే: స్థానిక 7వ వార్డుకు చెందిన కౌన్సిలర్ సవరపు సతీష్ ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో తెదేపాలో చేరారు. ఈయన ఎన్నికల్లో వైకాపా రెబల్ అభ్యర్థిగా గెలుపొంది అనంతరం వైకాపాతో కొనసాగారు. సతీష్‌తోపాటు ఆయన అనుచరులు తెదేపాలో చేరారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని సతీష్ తెలిపారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి, పట్టణ తెదేపా అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, వల్లూరి ఇందిరారాణి, మల్లిపూడి గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠ

మండపేట, న్యూస్‌టుడే: స్థానిక మారేడుబాక వంతెన సమీపంలో హెచ్‌పీ గ్యాస్ డీలర్ బిక్కిన సత్యనారాయణ(చిన్న) నిర్మించిన శ్రీకృష్ణుడి ఆలయంలో విగ్రహాలను విజయదశమి సందర్భంగా ప్రతిష్ఠించారు. ఆయన కుమారుడు డాక్టర్ బిక్కిన గోపాలకృష్ణ, డాక్టర్ బిక్కిన పద్మ పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సందర్శించారు.

మలుపులు.. ప్రమాదాలకు నిలయాలు

మండపేట మండలంలో పలు మలుపులు ప్రమాదకరంగా మారాయి. చోదకులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. మండపేట నుంచి తాపేశ్వరం వెళ్లే ఎస్‌బీఎస్‌ఆర్ కుట్టుశిక్షణా కేంద్రం, అర్తమూరు తూము, సొసైటీ గోదాములు, ఇప్పనపాడు రూరల్ పోలీసు స్టేషన్ మలుపు, లక్ష్మన్ పేపర్‌మిల్లు వంటి మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. తాపేశ్వరం నుంచి పేకేటిపాకలకు వెళ్లే జిల్లా పరిషత్ పాఠశాల వద్ద, పేకేటిపాకల తూము, వెలగతోడు వెళ్లే రహదారి వద్ద కూడా ఇదే పరిస్థితి. ఇలాంటి మలుపులను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం కొన్ని రహదారి పనులు చేసేందుకు ప్రతిపాదనలు తయారుచేశామని, అందులో భాగంగా బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని రామచంద్రపురం ర.భ.శాఖ డీఈ సూర్యనారాయణ పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం



ఎదురుగా వచ్చే వాహనం కనిపించని ఇప్పనపాడు మలుపు

జయజయహే.. జగజ్జననీ..

ద్రాక్షారామ: తొమ్మిది రోజులపాటు జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారిని రాజరాజేశ్వరీదేవి రూపంలో అలంకరించారు. భీమేశ్వరస్వామి వారిని దసరా వేడుకల సందర్భంగా పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భీమేశ్వరాలయానికి సంబంధించి దూపసేవ అనంతరం వేగాయమ్మపేట ఆస్థానమండపం జమ్మిచెట్టు వద్ద ఆలయ కార్యనిర్వాహణాధికారి ఏవీ దుర్గాభవాని వేగాయమ్మపేట జమిందారు మనుమడు వాడ్రేవు సుందరరత్నాకర్ ఆధ్వర్యంలో శమీపూజ జరిగింది. ✦ రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మండపేట ధర్మగుండం చెరువు వద్దగల శ్రీరామమందిరం సామాజిక హాలులో నిర్వహించిన దుర్గా పూజలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పాల్గొన్నారు. ✦ ద్వారపూడి వస్త్రదుకాణ పాత సముదాయం వద్ద ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 108 రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు.



పసలపూడిలో నవదుర్గల వేషధారణలో చిన్నారులు



ద్రాక్షారామలో రాజరాజేశ్వరిగా..



ద్వారపూడిలో..



రామచంద్రపురంలో..



సోమేశ్వరంలో..



అంగరలో మహానివేదన

✦ పామర్రు పోలీసు స్టేషనులో ఆయుధ పూజ చేశారు. ✦ రాయవరం వెదురుపాక విజయదుర్గాపీఠంలో విజయదుర్గాదేవికి ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవమూర్తిని ప్రత్యేక రథంపై గ్రామోత్సవం నిర్వహించారు. పసలపూడి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పారిశ్రామికవేత్త చింతా కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దసరా పాటలను ఆలపిస్తూ, అమ్మవారి నవరూపాల వేషధారణలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ✦ అంగరలో రాజరాజేశ్వరి అమ్మవారికి 41 రకాల ప్రసాదాలతో మహా నైవేద్యం సమర్పించారు.

ఘనంగా గొర్రిపాటి జయంతి

రాయవరం: స్వాతంత్ర్య సమరయోధుడు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొర్రిపాటి బుచ్చిఅప్పారావు 111వ జయంతి వేడుకలను రాయవరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వెలమ రామాలయం వద్ద రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ, అనపర్తి, మండపేట నియోజకవర్గాల వెలమ సంక్షేమ సంఘాల అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు సిరిపురపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గొర్రిపాటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తాతపూడి రిజర్వాయర్ నిర్మాణానికి బుచ్చి అప్పారావు చేసిన కృషి మరువలేనిదని వెలమ సంఘీయులు స్మరించుకున్నారు. కె.దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శి లచ్చిరెడ్డి సత్యనారాయణ, కార్యదర్శి దాకా మహేష్‌నాయుడు, బొడ్డు ముత్యాలరావు, బీఎల్ లక్ష్మణరావు, కొల్లు అప్పారావు, సిరిపురపు భానుచందర్, బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిఅప్పారావు చిత్రపటానికి పూలమాల వేసిన వెలమ సంఘ నాయకులు

ఆదర్శప్రాయుడు లక్ష్మణమూర్తి

అంగర, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు తోరాటి లక్ష్మణమూర్తి జీవితం యువతకు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కపిలేశ్వరపురం మండలం అంగరలో తోరాటి లక్ష్మణమూర్తి 98వ జయంతిని ఆదివారం నిర్వహించారు. స్థానిక తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం, అమరవీరుల స్మారక స్థూపం, గాంధీ సెంటరులో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంగరకు చెందిన లక్ష్మణమూర్తి స్వాతంత్ర్యం అనంతరం తెలంగాణలో సాగిన రైతుల సాయుధ పోరాటంలో పాల్గొని, పోలీసుల కాల్పుల్లో వీరమరణం పొందారని గుర్తు చేసుకున్నారు. సీనియర్ సిటిజన్ సంకాబత్తుల ఎర్రబ్బులును సత్కరించారు. గ్రామ సర్పంచి వాసా కోటేశ్వరరావు, పడమర ఖండ్రిక సర్పంచి తిరునాతి ఆదిలక్ష్మి, ఉపసర్పంచి ఎర్రా వీరన్నబాబు, పెద్దింశెట్టి లక్ష్మణమూర్తి, జుత్తుగ మల్లికార్జునుడు, ముత్తా అబ్బు, తాపీ మేస్త్రీల సంఘం నాయకులు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న గ్రామస్థులు

నేటి నుంచి పల్లె పండగ

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో సోమవారం నుంచి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణమూర్తి తెలిపారు. సోమవారం మారేడుబాక, ద్వారపూడి, ఇప్పనపాడు, జడ్.మేడపాడు, తాపేశ్వరం గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులకు భూమిపూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు దృష్టి సారించి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ద్వారపూడి సంగీత వెంకటరెడ్డి నగర్ రెండో వీధిలోని కాలువలో మురుగు పారడం లేదని, దుర్వాసనతోపాటు దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు తెలిపిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి ఆకుల వి.వి.రమణ స్పందించారు. ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. మురుగు పారుదలకు చర్యలు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



తర్వాణిపేటలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అర్తమూరులో షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవ ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఆలయం వద్ద గణపతి హోమం, సాయిబాబా వారికి అభిషేక కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో మండపేట మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పాల్గొన్నారు. నెక్ సభ్యులు పడాల సుబ్బారెడ్డి, ఉపసర్పంచి కర్రి జంబయ్య, తెదేపా నాయకులు, గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మండపేట: విజయదశమి, షిర్డీ సాయిబాబా మహా సమాధి మహోత్సవం సందర్భంగా పలు మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక అగ్రహారం వీధిలోని సాయిబాబా మందిరంలో అన్నాభిషేకం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు యడవిల్లి చంద్రశేఖర్, విజయ దంపతులు పాల్గొన్నారు. తర్వాణిపేటలోని సాయిబాబా మందిరం వద్ద ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు కాసా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



అన్నదాన కార్యక్రమంలో నాయకులు